సాక్షి
కుమురం భీం

ఆదివారం : 5 ఫిబ్రవరి : 2023



కన్నుల పండువగా కల్యాణం

గంగాపూర్ బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై తిలకించారు. 9లో▸



టేక్ 'డై' వర్షన్..!

వాంకిడి మీదుగా నిర్మిస్తున్న ఫోర్‌లేన్ రహదారి ప్రజల పాలిట శాపంలా మారింది. అధికారుల నిర్లక్ష్యంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
32.3 /13.5

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గుతుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా అనిపిస్తుంది. రాత్రి చలి ప్రభావం కొనసాగుతుంది.

'ఉపాధి' అక్రమాలకు చెక్

- కూలీల హాజరు ఆన్‌లైన్‌లో..
- పనికి హాజరైన కూలీల ఫొటోలు యాప్‌లో అప్‌లోడ్ చేస్తేనే వేతనం
- కేంద్రం అధీనంలోకి ఈజీఎస్ స్కీం
- అమలుకు పకడ్బందీ చర్యలు

జిల్లాలో ఈజీఎస్ వివరాలు

జాబ్‌కార్డుల సంఖ్య: **1.24** లక్షలు
కూలీల సంఖ్య: **2.52** లక్షలు
యాక్టివ్ కూలీల సంఖ్య: **1.72** లక్షలు



గోయగాంలో పని స్థలంలో కూలీల ఫొటో తీస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్

కెరమెరి(ఆసిఫాబాద్): జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో అక్రమాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రత్యేకంగా నేషనల్ మస్టర్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఎన్‌ఎంఎంఎస్) మొబైల్‌యాప్‌ను రూపొందించి కూలీల హాజరును ఆన్‌లైన్ చేస్తోంది. పని స్థలాల్లో హాజరైన కూలీల ఫొటోలను ఏరోజుకారోజు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించింది. అప్పుడే పనికి హాజరైన కూలీల మస్టర్ పడి వేతనం అందనుంది. కానీ.. చాలాచోట్ల సిగ్నల్ సరిగా లేని కారణంగా యాప్‌లో ఫొటోలు అప్‌లోడ్ చేసే ప్రక్రియ అంతా ఈజీ కాదని ఫీల్డ్ అసిస్టెంట్లు వాపోతున్నారు.

జిల్లాలో 2.52 లక్షల మంది కూలీలు

జిల్లాలోని 335 గ్రామపంచాయతీల్లో 1.24 లక్షల జాబ్‌కార్డులున్నాయి. 2.52 లక్షల మంది కూలీల పేర్లు కార్డుల్లో నమోదై ఉండగా యాక్టివ్‌గా పని చేసే కూలీలు 1.72 లక్షల మంది మాత్రమే. ఈ ఆర్థిక సంవత్సరం నుంచి ఉపాధి పనుల పర్యవేక్షణ కేంద్ర ప్రభుత్వ అధీనంలోకి వెళ్లింది. దీంతో కూలీలు 100 రోజుల వరకే పనులు చేయాల్సి ఉంటుంది. వ్యవసాయ పనులు మినహాయిస్తే పేద కుటుంబాలను ఏడాది పొడవునా ఉపాధిహామీ పథకం ఆదుకోనుంది. గ్రామాల్లో ప్రధానంగా రైతులకు ప్రయోజనాన్ని కల్పించే కాలువల నిర్మాణాలు, మరమ్మతులు, పూడికతీత పనులు, వ్యవసాయ పనులు, భూముల అభివృద్ధి పనులు, హరితహారంలో భాగంగా మొక్కలు నాటేందుకు గుంతల తీత తదితర పనులు చేస్తుండగా కూలీలు హాజరవుతున్నారు.

ఒక్కరున్నా ఆన్‌లైన్‌లోనే హాజరు

ఎన్‌ఎంఎంఎస్ యాప్ ద్వారా గతంలో 20మంది కంటే ఎక్కువ మంది కూలీలు హాజరైతేనే ఆన్‌లైన్‌లో నమోదు చేసేవారు. ప్రస్తుతం సంఖ్యతో పని లేకుండా ఒక్క కూలీ హాజరైనా ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లోనే అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. పని ప్రదేశంలో రెండుసార్లు ఫొటోలు అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఉదయం 6నుంచి 11వరకు మొదటిసారి, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల్లోపు రెండోసారి కూలీల ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

20 పనులు మాత్రమే..

ఉపాధిహామీ పనులను ఆన్‌లైన్ చేయాల్సి ఉండగా ఇంకుడుగుంతలు, మేకల షెడ్లు, వ్యక్తిగత మరుగుదొడ్లు, వ్యక్తిగత ప్రయోజనాలకు మినహాయింపు ఇచ్చింది. గతంలో ఒక్కో గ్రామానికి ఏడాదిలో 40 పనుల వరకు చేపట్టే అవకాశం ఉండగా ఇప్పుడు 20 పనులకే పరిమితం చేసింది. ఏడాదిలో ఒక్కో కుటుంబానికి 100 రోజులు పని కల్పించాల్సి ఉండగా 60 రోజులకు కూడా పని కల్పించడం లేదని పలువురు ఉపాధిహామీ కూలీలు ఆరోపిస్తున్నారు. ఉపాధిహామీ కింద కోరిన వారికి రెండు వారాల్లో పని కల్పించాల్సి ఉండగా ఆ నిబంధన పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని వాపోతున్నారు.

సిగ్నల్ లేని చోట కష్టమే..

సిగ్నల్ లేని ప్రాంతాల్లో యాప్ ద్వారా హాజరు నమోదు చేసే ప్రక్రియ సాధ్యం కాని పరిస్థితి ఉంది. జిల్లాలోని సగం గ్రామపంచాయతీలు మారుమూల ప్రాంతాల్లోనే ఉన్నాయి. చాలా చోట్ల సిగ్నల్స్ లేవు. అలాంటప్పుడు ఆన్‌లైన్ హాజరు ఎలా సాధ్యమని పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు వాపోతున్నారు. కాగా, ఒక్కో ఫీల్డ్ అసిస్టెంట్‌కు రెండు నుంచి నాలుగు గ్రామపంచాయతీల బాధ్యతలు ఉండడం కూడా ప్రక్రియ అమలుకు క్షేత్రస్థాయిలో ఇబ్బందులేర్పడే ప్రమాదముందని చెబుతున్నారు.

పని చేసినవారికే వేతనం



పని చేసే కూలీల ఫొటోలు తీసి యాప్‌లో తప్పకుండా అప్‌లోడ్ చేయాలి. దీంతో పని చేసినవారికే వేతనం అందుతుంది. సిగ్నల్ లేని ప్రాంతాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు పని చేసే కూలీల ఫొటోలను కలెక్టరేట్ కార్యాలయానికి పంపిస్తే హాజరు వేస్తాం. పని చేయని కూలీల ఫొటోలు అప్‌లోడ్ చేస్తే పసిగట్టి సదరు ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకుంటాం.

– కుటుంబరావు, అదనపు డీఆర్డీవో

గత నెల నుంచే అమలు

ఇక నుంచి ఉపాధిహామీ కూలీలందరి వివరాలు ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఇందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని కేంద్రం రూపొందించింది. పథకం ప్రారంభం నుంచి ఇప్పటివరకు కూలీల హాజరు విషయంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రారంభంలో మాన్యువల్ విధానంలో హాజరు వేసేవారు. 2021 డిసెంబర్ వరకు ఈ విధానం కొనసాగగా గత నెల 1నుంచి కూలీల హాజరును ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో నమోదు చేయాలని కేంద్రం ప్రభుత్వం ఆదేశించింది. కేంద్రం ఆదేశానుసారం ఈ ప్రక్రియను జిల్లాలో అమలు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.



కెరమెరిలో ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్న ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన అదనపు కలెక్టర్



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న రాజేశం

ఆసిఫాబాద్: కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన బదావత్ సంతోష్‌ను అదనపు కలెక్టర్ రాజేశం శనివారం మంచిర్యాల కలెక్టర్ చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా సాధించేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

ప్రజాప్రస్థానం పాదయాత్రలో జిల్లా నాయకుడు



పాదయాత్రలో షర్మిలతో గోవింద్‌నాయక్

ఆసిఫాబాద్: వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు షర్మిల శనివారం వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గంలోని నెక్కొండలో నిర్వహించిన పాదయాత్రలో పార్టీ జిల్లా అధ్యక్షుడు భూక్యా గోవింద్‌నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని మండలాల్లో జరుగుతున్న కార్యక్రమాలతో పాటు పార్టీ బలోపేతం గురించి అధ్యక్షురాలికి వివరించినట్లు ఆయన తెలిపారు. రాబోయే రోజుల్లో షర్మిల ఆసిఫాబాద్ నియోజకవర్గంలో పాదయాత్ర నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.


6నుంచి ప్రీఫైనల్ పరీక్షలు

ఆసిఫాబాద్‌రూరల్: ఇంటర్ బోర్డు ప్రకటించిన అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలల్లో ఈ నెల 6నుంచి 13వరకు ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించాలని డీఐఈవో శ్రీధర్ సుమన్ ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు ముందస్తుగా టైంటేబుల్ ప్రకటించి పరీక్షలకు సన్నద్ధం చేయాలని సూచించారు.

15వరకు ఫీజు చెల్లించాలి

ఆసిఫాబాద్‌రూరల్: ఏప్రిల్‌లో నిర్వహించనున్న పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు తత్కాల్ ద్వారా ఈ నెల 15వరకు ఫీజు చెల్లించాలని డీఈవో అశోక్ ఓ ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్ పదో తరగతి, ఒకేషనల్ ఓపెన్ పదో తరగతి విద్యార్థులు ఆయా పాఠశాలల్లో రూ.వెయ్యి అపరాధ రుసుం చెల్లించాలని సూచించారు.

నూతన కార్యవర్గం



జిల్లా ఆప్తామాలిక్ సంఘం సభ్యులు

ఆసిఫాబాద్: జిల్లా ఆప్తామాలిక్ ఆఫీసర్స్, ఆప్తామెట్రిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఎనగంటి ప్రవీణ్‌ను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వంశీ, నాగేశ్, సాయి, రవీందర్, గణేశ్, రుచిత, మౌనిక, స్నేహ, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్‌రూరల్: ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయుల అసోసియేషన్ రూపొందించిన 2023 క్యాలెండర్‌ను అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, డీఈవో అశోక్, డీటీడీవో మణెమ్మ శనివారం జిల్లా కేంద్రంలో వేర్వేరుగా ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో పేట జిల్లా అధ్యక్షుడు సరేంద్ర, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, జిల్లా క్రీడాధికారి మధుసూదన్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ రవి

సిర్పూర్(టి): మండలకేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టులో ఈనెల 11వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ రవి సూచించారు. శనివారం మండలకేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టులో కోర్టు పరిధిలోని సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ లోక్‌అదాలత్‌లో పెండింగ్ కేసులు, ఇతర అన్ని రకాల కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కక్షిదారులకు అవగాహన కల్పించి ఇరువర్గాలు రాజీపడేలా కృషి చేయాలని సూచించారు.

బాల్యవివాహాల నిర్మూలనకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో బాల్యవివాహాల నిర్మూలనకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా బాలల సంరక్షణాధికారి మహేశ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని బాలరక్ష భవన్‌లో బాల్యవివాహాల నిర్మూలనకు సంబంధించి జిల్లా బాలల సంరక్షణ విభాగం చైల్డ్‌లైన్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం వివాహ ముహూర్తాల సమయం ఉన్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామస్థాయిలోనూ బాల్యవివాహాల నిషేధ చట్టం–2006పై రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, ఐసీడీఎస్ సిబ్బంది భాగస్వామ్యంతో అవగాహన కల్పించాలని, చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098 ప్రజలకు తెలిసేలా ప్రచారం చేయాలని సూచించారు.

జిల్లా బంద్ సక్సెస్ చేయాలి

ఆసిఫాబాద్: క్వింటాల్ పత్తికి రూ.12వేల మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 6న తలపెట్టిన జిల్లా బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు అవుడపు ప్రణయ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని బీసీ సంఘ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వ్యాపారవాణిజ్య సంస్థలతో పాటు విద్యాసంస్థలు బంద్ పాటించి రైతులకు మద్దతు తెలుపాలని కోరారు. ప్రారంభంలో క్వింటాల్ పత్తికి రూ.9వేలు ఉండగా క్రమేపీ తగ్గుతూ రూ.7,500కు పడిపోయిందన్నారు. దీంతో రైతులు తీవ్ర నష్టాల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తంజేశారు. పత్తి ధర పెంచాలని కోరుతూ రెండు నెలలుగా దశలవారీగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సంఘం నాయకులు గుర్నులె మెంగాజీ, శెండె వాసు, బొట్టుపల్లి ప్రశాంత్, గడ్డల ప్రణయ్, సోనులే దత్తు, కోలె వెంకట్, సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రణయ్

బంద్‌కు రైతు సంఘాల పిలుపు

వాంకిడి: పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలనే డిమాండ్‌తో ఈ నెల 6న తలపెట్టిన జిల్లా బంద్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని రైతు హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బొట్టుపల్లి జైరాం పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో సంఘ సభ్యులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పత్తికి గిట్టుబాటు ధర రూ.15 వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో ధర్నా నిర్వహించి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లా బంద్‌కు వ్యాపారులు, విద్యార్థి సంఘాలు, రైతులు మద్దతుగా నిలవాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు గుర్నులె మెంగాజీ, కోశాధికారి సెండె వాసు, నాయకులు కోలె సదాశివ్, పాపయ్య, బక్కయ్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జైరాం

చకచకా వారధి పనులు

- ఇటీవల కూలిన పిల్లర్ల నిర్మాణానికి ప్రతిపాదనల తయారీలో అధికారులు
- జూన్‌లోగా పనుల పూర్తికి సన్నాహాలు



కొనసాగుతున్న పనులు

దహెగాం: కాగజ్‌నగర్ మండలం అందవెల్లి పెద్దవాగుపై కూలిన వంతెన మరమ్మతు పనులు చకచకా కొనసాగుతున్నాయి. రూ.2.90కోట్లతో చేపట్టనున్న కొత్త పిల్లరు, స్లాబు నిర్మాణ పనులకు 2022 నవంబర్‌లో టెండర్లు పిలవగా వల్లభనేని కన్‌స్ట్రక్షన్ లిమిటెడ్ కంపెనీ మాత్రమే ముందుకు వచ్చింది. కాగా, పనుల ప్రారంభానికి ముందే వంగిన పిల్లర్‌తోపాటు మరో రెండు పిల్లర్లు కుప్పకూలిన విషయం తెలిసిందే. వీటి నిర్మాణానికి అవసరమైన నిధుల కోసం అధికారులు అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదించే పనిలో ఉన్నారు.

2021లోనే కుంగిన వంతెన

కాగజ్‌నగర్–దహెగాం, మంచిర్యాల జిల్లా భీమిని మండలాల ప్రజల రవాణా సౌకర్యార్థం కాగజ్‌నగర్ మండలం అందవెల్లి పెద్దవాగుపై 20 ఏళ్ల క్రితం వంతెన నిర్మించారు. 2021 జూలైలో వచ్చిన భారీ వరదల కారణంగా ఏడో పిల్లర్ కుంగిన విషయం తెలిసిందే. దీంతో వానాకాలంలో భారీ వాహనాలను వంతెన పైనుంచి రాకపోకలు సాగించకుండా సెక్యూరిటీని ఏర్పాటు చేశారు. వానాకాలం తర్వాత వంతెన వద్ద సెక్యూరిటీని తొలగించడంతో భారీ వాహనాలు వంతెన పైనుంచి వెళ్లాయి. 2022 జూలైలో మరోసారి భారీ వర్షాలు రాగా పెద్దవాగులోకి వరద పోటెత్తి కుంగిన పిల్లర్ మరింత కుంగి పక్కకు ఒరిగింది. దీంతో వంతెన పైనుంచి పూర్తిగా రాకపోకలను నిషేధిస్తూ అడ్డుగా గోడలు నిర్మించారు. వంతెన కుంగినప్పుడే మరమ్మతు చేసి ఉంటే ఇంతదాకా వచ్చేది కాదని పలువురు పేర్కొంటున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతోనే ఈ పరిస్థితి ఎదురైందని ఆరోపిస్తున్నారు. దీంతో దహెగాం, భీమిని మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న విషయం తెలిసిందే. రాకపోకలను సాగించడానికి వాగులో తాత్కాలిక రోడ్డు నిర్మించారు. ప్రస్తుతం తాత్కాలిక రోడ్డు పైనుంచి కాగజ్‌నగర్ పట్టణానికి రాకపోకలు కొనసాగుతున్నాయి. పెంచికల్‌పేట్ పెద్దవాగుపై వంతెన పూర్తయినా అప్రోచ్ రోడ్డు పూర్తి కాలేదు. లగ్గాం సమీపంలో మరో చిన్న వంతెన ఉంది. అదే చోట మరో వంతెన నిర్మించడానికి రూ.11కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు.

పెరిగిన అంచనా వ్యయం

భారీ వరదలకు వంతెన ఎనిమిదో పిల్లర్ కుంగి పక్కకు ఒరిగి ప్రమాద స్థాయికి చేరగా రాకపోకలు నిషేధించారు. గతేడాది నవంబర్‌లో రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ కింద వంతెనకు మరమ్మతు కోసం రూ.2.90 కోట్లు మంజూరయ్యాయి. పనులు ప్రారంభానికి ముందే 9, 10వ పిల్లర్లు కూడా నేలమట్టం కావడంతో ఇంజినీరింగ్ అధికారుల అంచనాలు తారుమారయ్యాయి. పెరిగిన వ్యయం మంజూరైతే టెండర్లు పిలుస్తారా? పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌కే పనులు అప్పగిస్తారా? అనే విషయంలో సందిగ్ధత నెలకొంది. అధికారులు మాత్రం పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌కే ఈ పనులు కూడా అప్పగించే అవకాశాలు ఉన్నాయని పేర్కొంటున్నారు. వంగిన పిల్లర్ అలాగే ఉంది. దానితో పాటు ఏడో పిల్లర్ కూడా తొలగించాల్సి ఉంటుంది. దీంతో నాలుగు పిల్లర్లు, ఐదు స్లాబ్‌లు, అబార్ట్‌మెంట్ నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. దీనికి అంచనాలు తయారు చేయడంలో ఆర్‌అండ్‌బీ అధికారులు నిమగ్నమయ్యారు. రెండు, మూడు రోజుల్లో అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. వచ్చే వానాకాలం జూన్‌లోగా పనులు పూర్తి చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. కూలీలు ఉండడానికి అదే ప్రాంతంలో షెడ్లు నిర్మించారు. కూలిన వంతెనను తొలగించి పిల్లర్ పనులు కొనసాగిస్తున్నారు.



కూలిన వంతెన

జూన్‌లోగా పూర్తి చేసేందుకు చర్యలు

అందవెల్లి పెద్దవాగుపై వంతెనకు రూ.2.90 కోట్లు మంజూరయ్యాయి. పనులు వేగంగానే కొనసాగుతున్నాయి. మరో రెండు పిల్లర్లు నేలమట్టం కావడంతో నిధుల కోసం అంచనాలు రూపొందిస్తున్నాం. రెండు, మూడు రోజుల్లో అంచనాలు పూర్తి చేసి ప్రభుత్వానికి పంపిస్తాం. వంతెన పనులు జూన్‌లోగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం వాగులో తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేశాం. ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. పెంచికల్‌పేట్, లగ్గాం వద్ద మరో వంతెన నిర్మాణానికి రూ.11 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం.

– పెద్దన్న, ఆర్‌అండ్‌బీ ఈఈ



జూనియర్స్ విభాగంలో చాంపియన్‌గా నిలిచిన ఎస్సారార్, మంచిర్యాల

ఎస్‌పీఎల్ చాంపియన్స్ ఎస్సారార్, వాగ్దేవి

కరీంనగర్‌స్పోర్ట్స్: సాక్షి ప్రీమియర్ లీగ్ సీజన్–4 శనివారం అట్టహాసంగా ముగిసింది. సీనియర్ విజేతగా మంచిర్యాల వాగ్దేవి డిగ్రీ కాలేజీ, జూనియర్ విజేతగా మంచిర్యాల ఎస్సారార్ జూనియర్ కళాశాల జట్లు నిలిచాయి. – వివరాలు 8లో..



సీనియర్స్ విన్నర్ జట్టు వాగ్దేవి డిగ్రీ కళాశాల, మంచిర్యాల

'సరిహద్దు'లో సిగ్నల్ సిత్రాలు

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు వివాదాస్పద గ్రామమైన పరంధోలితోపాటు కొటా, ముకదంగూడ, మహారాజ్‌గూడలో సెల్ సిగ్నల్ ఉండదు. ఏ నెట్‌వర్క్ సిమ్ వాడినా ఇదే పరిస్థితి. మొబైల్ మోగాలంటే ఆయా గ్రామాల ప్రజలు కిలో మీటర్ల దూరంలోని పెద్దచెట్లు, గుట్టలు ఎక్కాల్సిందే. సిగ్నల్ కోసం పరంధోలి గ్రామ శివారులోని ఓ మంచెపైకి ఎక్కిన ఇద్దరు యువకులు ఇలా మొబైల్ వినియోగిస్తుండగా తీసిన చిత్రమిది.



క్లుప్తంగా

వెల్ఫేర్‌బోర్డు ఏర్పాటు చేయాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పాత మంచిర్యాల: ట్రాన్స్‌పోర్టు రంగంలో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం తెలంగాణ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు కలెక్టరేట్‌లో ఏవో సురేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ట్రాన్స్‌పోర్టు రంగంలో 20 లక్షల మంది పని చేస్తున్నారని, వారికి ప్రభుత్వపరంగా ఎలాంటి సంక్షేమ పథకాలు లేవన్నారు. బడ్జెట్ సమావేశాల్లో వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేస్తే కార్మికులకు లబ్ధి చేకూరుతుందన్నారు. 2019 మోటార్ వెహికిల్ యాక్టు సవరించాలని, జిల్లా కేంద్రంలోని రైల్వేగేట్ వద్ద ఆటోఅడ్డా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, సుధీర్, సతీశ్, హరీశ్, అరవింద్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ పాల్గొన్నారు .

డ్రెయినేజీలోకి దూసుకెళ్లిన లారీ

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ఎల్లాగౌడ్ తోటలో శనివారం ఓ లారీ అదుపుతప్పి డ్రెయినేజీలోకి దూసుకెళ్లింది. నీటి ట్యాంక్ సమీపంలో సిమెంట్ రోడ్డుపై మిషన్ భగీరథ పనులు చేపడుతుండగా మట్టి కుప్పలను తప్పించబోయిన లారీ పక్కనే ఉన్న డ్రెయినేజీలోకి దూసుకెళ్లింది.

21 మందిపై పిచ్చికుక్కల దాడి

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని బస్టాండ్ ఏరియా, రిక్షా కాలనీల్లో శనివారం 21 మందిపై పిచ్చికుక్కలు దాడిచేసి గాయపర్చాయి. కాలనీకి చెందిన శ్రీధర్ రెడ్డి, ఇర్ఫాన్, లతీఫ్, ఇమానియల్, మహీర్, మల్లేశ్, హన్మంతు, పోశం, కనకమ్మ, నౌగంబస్తీ నివాసులు నలుగురితో పాటు కౌటాలకు చెందిన నవీన్, గాంధీనగర్ వాసులు లక్ష్మీ, గౌతం, వినోద్, సతీశ్‌లపై పిచ్చి కుక్కలు దాడి చేసినట్లు బాధితులు తెలిపారు.

జోరుగా... హుషారుగా



మల్యాల వాచ్‌టవర్ ఎక్కుతున్న బర్డ్‌వాచర్లు

- జన్నారం రేంజ్‌లో బర్డ్‌వాక్
- హాజరైనా 51 మంది బర్డ్‌వాచర్లు
- తొలిరోజు బైసన్‌కుంటలో పర్యటన

జన్నారం(ఖానాపూర్): జన్నారం అటవీ డివిజన్‌లో పక్షులకోసం చేపట్టిన నడక జోరుగా హుషారుగా సాగింది. బర్డ్‌వాక్ గురించి అటవీశాఖ ప్రకటించడంతో ఢిల్లీతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, కామారెడ్డి, తదితర జిల్లాల నుంచి పక్షి ప్రేమికులు తరలివచ్చారు. వీరితో పాటు ఫారెస్ట్ కళాశాల రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌సీఆర్‌ఐ) నుంచి 15 మంది విద్యార్థులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో కలిపి మొత్తం 51 మంది బర్డ్ వాక్‌కు తరలివచ్చారు. వారిని మధ్యాహ్నం భోజనం అనంతరం



పక్షులను కెమెరాలో బంధిస్తున్న బర్డ్‌వాచర్లు

మల్యాల వాచ్‌టవర్, అక్కడి నుంచి బైసన్‌కుంటకు తీసుకెళ్లారు. అక్కడ కుంటలో వివిధ రకాల పక్షులు ఉండటంతో వాటిని తమ కెమెరాల్లో బంధించారు. ఆదివారం తెల్లవారు జామున మైసమ్మ కుంట, ఘనిషెట్టి, కుంటాల ప్రాంతాల్లో బర్డ్‌వాక్ చేయనున్నట్లు ఎఫ్‌డీవో మాధవరావు తెలిపారు. ఈ సందర్భంగా పక్షి ప్రేమికులు 'సాక్షి'తో తమ అనుభవాలు పంచుకున్నారు.

అన్ని ఏర్పాట్లు చేశాం



బర్డ్‌వాక్ కోసం వివిధ ప్రాంతాల నుంచి పక్షి ప్రేమికులు వచ్చారు. వారికి అన్ని ఏర్పాట్లు చేశాం. అడవిలో డేరాలు వేశాం. అక్కడే బస చేసేలా ఏర్పాట్లు చేశాం. భోజనం, టిఫిన్స్, నీటి వసతి కల్పించాం. వారిని అడవిలోకి తీసుకెళ్లడానికి వాహనాలు సమకూర్చాం. అందరు హుషారుగా బర్డ్‌వాక్‌లో పాల్గొన్నారు.

– సిరిపురం మాధవరావు, ఎఫ్‌డీవో

చాలా పక్షులను గుర్తించా



జన్నారం అడవులు చాల బాగున్నాయి. మొదటిరోజు అడవులను తింపారు. బైసన్ కుంట వద్ద అనేక రకాల పక్షులు కనిపించాయి. వీటిని మా కెమెరాల్లో బంధించాం. వివిధ రకాల పక్షుల ఫొటోలు సేకరించి, వాటి గురించి తెలుసుకోవడం నా హాబీ. నాతో పాటు నా భార్య, కుమారుడు కూడా వచ్చారు.

– జయదీప్, హైదరాబాద్

ఏర్పాట్లు బాగా చేశారు



బర్డ్‌వాక్ ఉందని తెలుసుకుని ఇక్కడికి వచ్చా. ఇక్కడికి రావడం మొదటిసారి. అధికారులు ఏర్పాట్లు బాగున్నాయి. జన్నారం అడవుల్లో పక్షులతో పాటు వన్యప్రాణులను గుర్తించాం. వాటిని కెమెరాల్లో బంధించాం. వాచ్‌టవర్, బైసన్ కుంటలకు తీసుకెళ్లారు. వివిధ రకాల పక్షులను గుర్తించి వాటి ఫొటోలు సేకరించాం.

– మహేందర్, హైదరాబాద్

నాలుగోసారి వచ్చా



పక్షులంటే నాకు చాలా ఇష్టం. వివిధ రకాల పక్షుల గురించి తెలుసుకోవడం నా హాబీ. ఇందుకోసం పలుచోట్లకు వెళ్లా. బర్డ్‌వాక్‌కు రావడం ఇది నాలుగోసారి. 200 రకాల పక్షులను గుర్తించి వాటి పేర్లు చెబుతా. ఇప్పటివరకు జన్నారం, పెంచికల్‌పేట్, ఆసిఫాబాద్ డివిజన్, తదితర ప్రాంతాలకు వెళ్లి పక్షులను కెమెరాలో బంధించా.

– లింగంపల్లి కృష్ణ, పక్షి ప్రేమికుడు

అంతర్‌జిల్లా పోటీల్లో సత్తా చాటాలి



ఎంపికైన క్రీడాకారులతో సర్పంచ్ సుమలత

రెబ్బెన(ఆసిఫాబాద్): నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్‌లో జరుగనున్న అంతర్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు సత్తా చాటాలని గోలేటి సర్పంచ్ పోటు సుమలత అన్నారు. శనివారం గోలేటి టౌన్‌షిప్ లోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–15 ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాకు చెందిన ఎంతో మంది క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించారన్నారు.

ఎంపికైన క్రీడాకారులు

ఎంపికైన క్రీడాకారుల జాబితాను అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి ప్రకటించారు. బాలుర జట్టుకు అక్షయ్, గోపాల శ్రీకృష్ణ, సిద్దార్థ, ప్రేందీప్, రుద్ర ధృవన్, వరుణ్‌కుమార్, నిఖిల్, నాగ ఈశ్వర్ అజ్మీర ప్రభాస్, వెంకటసాయి నాథ్‌రెడ్డి, నాగరాజు, కోచ్‌గా తిరుపతి, మేనేజర్‌గా కే.నవీన్ ఎంపికయ్యారు. బాలికల జట్టులో కావ్య హరిణి, శ్రీ స్ఫూర్తి కారుణ్య, ప్రజ్వల, సాయి శ్రీవర్షిణి, శ్రావ్య, శ్రీవల్లి, అఖిల, శ్రీలేఖిత, విష్ణుప్రియ, సిరిచందన, మేనేజర్‌గా లావణ్య, కోచ్‌గా గోపాల్ ఎంపికయ్యారు.

రాబోయే తరాలకు అటవీసంపద అందించాలి

- అటవీ రేంజ్ అధికారి శివజ్యోతి
- ముల్కల్లలో పర్యటించిన శిక్షణ బీట్ అధికారులు



అవగాహన కల్పిస్తున్న శివజ్యోతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రాబోయే తరాలకు అటవీ సంపద అందించేలా సమష్టిగా కృషి చేయాలని అటవీ రేంజ్ అధికారి శివజ్యోతి అన్నారు. శనివారం హాజీపూర్ మండలంలోని ముల్కల్ల అటవీ రేంజ్ పరిధిలో దూలపల్లి అకాడమీ కేంద్రంలో శిక్షణ పొందుతున్న 32వ బ్యాచ్‌కు చెందిన 39 మంది శిక్షణ బీట్ అధికారులు అటవీ క్షేత్రంలో విస్తృతంగా పర్యటించారు. అంతకు ముందు జిల్లాలోని కవ్వాల్ అభయారణ్యంలోని జీవ వైవిధ్యం, చిరుత, ఇండియన్ గార్, నీల్గాయిల ఆవాసాలు, జలపాతాలు, ఫ్లోరా, పానా అరుదైన జాతి మొక్కలపై అవగాహన కల్పించారు. శిక్షణ బీట్ అధికారులు దాదాపు రెండు గంటల పాటు 659, 660 కంపార్ట్‌మెంట్, పాతమంచిర్యాల, ముల్కల్ల అటవీ సెక్షన్ పరిధిలోని అటవీ ప్రాంతాలను, ర్యాలీ అటవీ ప్రాంతాన్ని కలియ తిరిగారు.

కోలిండియా పోటీలకు క్రీడాకారుల ఎంపిక

నస్పూర్(మంచిర్యాల): కోలిండియా స్థాయి హాకీ పోటీలకు శ్రీరాంపూర్ ఏరియా నుంచి నలుగురు క్రీడాకారులను ఎంపిక చేసినట్లు ఏరియా జీఎం బి.సంజీవరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్అండ్‌పీసీలో విధులు నిర్వర్తిస్తున్న ఈ.సదయ్య, ఐకే 1ఏలో జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తున్న బి.తిరుపతి, ఈపీ ఆపరేటర్ టి.సురేశ్, ఎస్సార్పీ ఓసీలో పనిచేస్తున్న ఎంవీ డ్రైవర్ జి.శ్రీకాంత్ ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 7 నుంచి 10 వరకు జార్ఖండ్‌లోని షోహగ్‌పూర్‌లో నిర్వహించే పోటీలలో సదరు కార్మికులు పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు.

సింగరేణి ఆస్తుల జాయింట్ సర్వే

నస్పూర్(మంచిర్యాల): నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సింగరేణి ఆస్తులను మున్సిపల్, సింగరేణి అధికారులు కలిసి శనివారం జాయింట్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రమేశ్ మాట్లాడుతూ అప్పటి గ్రామ పంచాయతీ నిబంధనల ప్రకారం మున్సిపాలిటీకి సింగరేణి ఆస్తి పన్ను ఏడాదికి రూ.50 లక్షలు చెల్లిస్తున్నారన్నారు. మున్సిపల్ చట్టం ప్రకారం సింగరేణి ఆస్తి పన్ను రూ.3 కోట్ల 71 లక్షల వరకు పెరిగిందన్నారు. పెరిగిన ఆస్తిపన్నును త్వరగా మున్సిపాలిటీకి చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఆర్‌ఓ సతీశ్, బిల్‌కలెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు పత్తి, వరి ధాన్యం దగ్ధం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని రాస్పెల్లిలో శనివారం రాత్రి పెర్క సంతోశ్‌కు చెందిన పత్తి, వరిధాన్యం ప్రమాదవశాత్తు దగ్ధమయ్యాయి. సంతోశ్ తన చేనులో నుంచి సేకరించిన వంద క్వింటాళ్ల పత్తి, 20 క్వింటాళ్ల వరిధాన్యం తన కొట్టంలో నిల్వ చేశాడు. ప్రమాదవశాత్తూ నిప్పంటుకుని పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. గమనించిన స్థానికులు మంటలను ఆర్పేందుకు యత్నించినా పూర్తిస్థాయిలో అదుపు కాకపోవడంతో ఫైరింజన్‌కు సమాచారం అందించారు. వారు వచ్చి మంటలను పూర్తిగా అదుపు చేశారు. ప్రమాదంలో రూ.8.40 లక్షల ఆస్తి నష్టం జరిగిందని బాధితులు బోరున విలపించారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. సంఘటన స్థలాన్ని స్థానిక సర్పంచ్ బొమ్మెల్ల పద్మ కిషన్ సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఎస్‌పీఎల్ చాంపియన్స్ ఎస్సార్‌ార్, వాగ్దేవి

- రన్నరప్‌గా నిలిచిన జ్యోతిష్మతి, వివేకానంద జట్లు
- అట్టహాసంగా ముగిసిన సాక్షి ప్రీమియర్ లీగ్ సీజన్‌– 4
- విజేతలకు బహుమతులు అందించిన సాంస్కృతిక సారథి చైర్మన్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



జూనియర్స్ రన్నరప్ జ్యోతిష్మతి డిప్లొమా కాలేజీ, కరీంనగర్



ఫైనల్ మ్యాచ్‌లో తలపడుతున్న వాగ్దేవి, వివేకానంద జట్లు



సీనియర్స్ రన్నర్ జట్టు వివేకానంద డిగ్రీకళాశాల, కరీంనగర్

కరీంనగర్‌స్పోర్ట్స్: ఆకాశాన్ని అంటే సిక్సర్లు.. కళ్లు చెదిరే ఫోర్లు.. అదిరిపోయే ఫీల్డింగ్.. ఆకట్టుకునే కవర్ డ్రైవ్‌లు.. హుక్‌షాట్లతో నాలుగురోజుల పాటు క్రికెట్ అభిమానులకు కనువిందుచేసిన సాక్షి ప్రీమియర్ లీగ్ సీజన్–4 శనివారంతో అట్టహాసంగా ముగిసింది. 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో, రీజినల్ స్పాన్సర్ సుధాకర్ పీవీసీ పైప్స్ సౌజన్యంతో 'సాక్షి' చేసిన ప్రయత్నం విజయవంతం అయ్యింది. తిమ్మాపూర్ జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాల మైదానం కేరింతలతో ముంచెత్తిన క్రికెట్ సంబురం ముగిసింది.

జూనియర్స్ ఫైనల్..

మంచిర్యాల ఎస్సార్‌ార్ జూనియర్ కళాశాల, కరీంనగర్ జ్యోతిష్మతి డిప్లొమా కళాశాలల మధ్య ఫైనల్ పోరు జరిగింది. టాస్ గెలిచిన ఎస్సార్‌ార్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 12ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 127 పరుగులు చేసింది. 128పరుగుల భారీలక్ష్యంతో బరిలోకి దిగిన జ్యోతిష్మతి జట్టు నిర్ణీత 12ఓవర్లలో 10వికెట్లు కోల్పోయి 60పరుగులు చేసి ఓటమి పాలైంది. ఎస్సార్‌ార్ జట్టు 67పరుగుల భారీ స్కోర్ తేడాతో సీజన్–4 చాంపియన్‌గా నిలిచింది. ఎస్సార్‌ార్ జట్టులో వినయ్ హ్యాట్రిక్‌తో మొత్తంగా ఐదు వికెట్లు తీశాడు. హుర్రేయర్ 30 పరుగులు, సజన్ 27పరుగులు చేశారు.

సీనియర్స్ ఫైనల్

మంచిర్యాల వాగ్దేవి డిగ్రీ కాలేజీ, కరీంనగర్ వివేకానంద డిగ్రీ కళాశాలల మధ్య ఫైనల్ పోరు జరిగింది. టాస్ గెలిచిన వాగ్దేవి జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 12ఓవర్లలో 6వికెట్లు కోల్పోయి 117పరుగుల భారీ స్కోరు చేసింది. 118 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన వివేకానంద జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 6వికెట్లు కోల్పోయి 85పరుగులు చేసి ఓటమి పాలైంది. వాగ్దేవి జట్టు 33పరుగుల భారీస్కోర్ తేడాతో సీజన్–4 సీనియర్ చాంపియన్‌గా నిలిచింది. జట్టులో వినయ్ 36, ఇస్మాయిల్ 32, సాయి 20పరుగులు చేసి ఆకట్టుకున్నారు. వివేకానంద జట్టులో భరత్ 2వికెట్లు తీశాడు.

జూనియర్స్ చాంపియన్ ఎస్సార్‌ార్ జూనియర్ కళాశాల, మంచిర్యాల	జూనియర్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వినయ్ (ఎస్సార్‌ార్)
జూనియర్ రన్నరప్ జ్యోతిష్మతి డిప్లొమా కళాశాల, తిమ్మాపూర్	జూనియర్స్ మ్యాన్ ఆఫ్ ది సిరీస్ హుర్రేయర్ (ఎస్సార్‌ార్)
సీనియర్స్ చాంపియన్ వాగ్దేవి డిగ్రీ కళాశాల, మంచిర్యాల	సీనియర్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ సాయికృష్ణారెడ్డి (వాగ్దేవి)
సీనియర్ రన్నరప్ వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల, కరీంనగర్	సీనియర్స్ మ్యాన్ ఆఫ్ ది సిరీస్ భరత్ (వివేకానంద)

భవిష్యత్ క్రికెటర్లకు వేదికగా నిలిచిన ఎస్‌పీఎల్: ఎమ్మెల్యే రసమయి

క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, సాక్షి ప్రీమియర్ లీగ్ భవిష్యత్ క్రీడాకారులకు వేదికగా నిలిచిందని సాంస్కృతిక సారథి చైర్మన్, మానకొండూర్ శాసనసభ్యుడు రసమయి బాలకిషన్ అన్నారు. శనివారం సాక్షి ప్రీమియర్ లీగ్ సీజన్–4 పోటీల బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విజేతలకు ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందించారు. తిమ్మాపూర్ మండలంలోని ఎల్ఎండీలో క్రికెట్‌స్టేడియం నిర్మాణానికి రూ.25లక్షలు తన నిధుల నుంచి ఇస్తామని ప్రకటించారు. జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు వి.ఆగంరావు మాట్లాడుతూ.. త్వరలో అన్ని జిల్లాకేంద్రాల్లో త్రీడే మ్యాచ్‌లు నిర్వహిస్తామని అన్నారు. 'సాక్షి' కరీంనగర్ బ్రాంచి మేనేజర్ వైద శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎస్‌పీఎల్ సీజన్–4 విజయవంతానికి కృషి చేసిన ప్రతీఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. సుధాకర్ పీవీసీ పైప్స్ ఏరియా మేనేజర్ షేక్‌రఫీ, సర్పంచ్ రావుల రమేశ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రావు, ఏడీవీటీ మేనేజర్ లక్ష్మీనారాయణ, సర్క్యులేషన్ మేనేజర్ మధుకర్‌రెడ్డి, సాక్షి సిబ్బంది సిలివేరి మహేందర్, పుల్లమల్ల యాదగిరి, బత్తుల రాకేశ్, గోలి కిరణ్, బోనగిరి పరుశరాములు, బీఆర్ఎస్ నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌కు ఎంపికైన వారికి శ్రీనివాస్‌రావు నగదు బహుమతులు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

రామకృష్ణాపూర్(చెన్నూర్): మందమర్రి పట్టణంలోని పంచముఖి హనుమాన్ ఆలయంలో ఈ నెల 2న చోరీకి పాల్పడ్డ ఇద్దరు నిందితులను శనివారం అరెస్టు చేసినట్లు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. పెద్దపల్లి మండలం జూలపల్లికి చెందిన గంగిపెల్లి మోహన్, నస్పూర్‌కు చెందిన మహ్మద్ ఆదిల్ ఈ నెల 2న తెల్లవారు జామున పంచముఖి ఆలయంలోని తలుపులు పగులగొట్టి విగ్రహానికి అలంకరించిన కిలో వెండి ఆభరణాలు దొంగిలించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆలయ అర్చకుడు కృష్ణకాంత్‌చార్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించామన్నారు. మంచిర్యాలలో ఆభరణాలు అమ్మేందుకు ప్రయత్నించగా శనివారం ఫ్లైఓవర్ వద్ద అరెస్టు చేశామన్నారు. ఎస్సై చంద్రకుమార్, పోలీస్ సిబ్బందిని పలువురు అభినందిస్తున్నారు.

దాడిలో గాయపడ్డ వ్యక్తి మృతి

రామకృష్ణాపూర్(చెన్నూర్): రవీంద్రఖని రైల్వేస్టేషన్ సమీపంలోని దర్గా నిర్వాహకుడు మహ్మద్ అబ్దుల్ సత్తార్ (57)పై గత నెల 26న ఐదుగురు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. తీవ్రంగా గాయపడ్డ సత్తార్‌ను కరీంనగర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించగా పరిస్థితి విషమించడంతో శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు పట్టణ ఎస్సై అశోక్ తెలిపారు. మంత్రాలు చేస్తున్నాడనే కారణంతో పాటు దర్గా సమీపంలోని ఓ స్థలం విషయంలో తలెత్తిన వివాదం కారణంగా పట్టణానికి చెందిన రవి, బుడిగె వంశీ, ప్రకాశ్, సాయి, వీరమల్ల రాజయ్య అతనిపై దాడికి పాల్పడ్డారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రైలు కిందపడి యువకుడు మృతి

రామకృష్ణాపూర్(చెన్నూర్): మందమర్రి రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం గుర్తు తెలియని రైలు కిందపడి 2వ జోన్‌కు చెందిన సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుడు సబ్బని నిరంజన్ (33) మృతి చెందాడు. మృతుడి తల, శరీరం రెండు భాగాలుగా విడిపోయాయి. యువకుడి మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆత్మహత్యకు పాల్పడ్డాడా? లేక ఎవరైనా హత్య చేసి పట్టాలపై పడేశారా? అనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. మృతుడు ఓ యువతితో సన్నిహితంగా ఉన్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ప్రేమ వ్యవహారమే మృతికి కారణమై ఉండవచ్చని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ కెంసారం సంపత్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

జన్నారం(ఖానాపూర్): మండలంలోని టీజీపల్లి ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. సదరు వ్యక్తి శుక్రవారం రాత్రి రోడ్డుపై నడుచుకుంటూ వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో గాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు 108 ద్వారా లక్సెట్టిపేట ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుని వివరాలు తెలియరాలేదన్నారు. ఎవరైన గుర్తు పడితే 8712656547 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.